పశుగణన షురూ

- ముమ్మరంగా జీవాల లెక్కింపు
- ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్న సిబ్బంది

కనిగిరి రూరల్: ప్రభుత్వం నిర్వహిస్తున్న పశు గణన లెక్క కార్యక్రమం గ్రామాల్లో ముమ్మరంగా సాగుతోంది. ప్రతి ఐదేళ్లకొక సారి నిర్వహించే ఈ కార్యక్రమంలో 2019లో ప్రారంభించారు. ఈ సర్వే ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ సంక్షేమ పథకాలు, రాయితీలు తదితర వాటిని అమలు చేస్తోంది. ఆవులు, గేదెలు, ఎద్దులు, గొర్రెలు, మేకలు, కుక్కలు, పందులు, గాడిదలు, గుర్రాలు వంటి మూగ జీవాలు లెక్కింపును ముమ్మరంగా చేస్తున్నారు. నవంబర్ 1 నుంచి శిక్షణ పొందిన సిబ్బందితో పాటు, ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్లు పాల్గొంటున్నారు. 2025 ఫిబ్రవరి నెలాఖరు వరకు జరుగుతుంది. ప్రతి రోజూ 20 నుంచి 30 ఇళ్ల వరకు సర్వే చేస్తున్నారు.

కనిగిరి నియోజకవర్గంలో ఇలా..

ఆరు మండలాల్లో ముగ్గురు ఏడీఏహెచ్‌లున్నారు. వారి పరిధిలోని ఆరు మండలాలున్నాయి. కనిగిరి ఏడీహెచ్ కింద కనిగిరి, పీసీపల్లి మండలాలున్నాయి. 17 మంది ఎన్యూమరేటర్లు, 3 సూపర్ వైజర్లు సర్వేలో పాల్గొని 30, 657 గృహాల్లో


మూగ జీవాలు

1,80,673 మేకలు.. గొర్రెలు, ఇతర జీవాలు, సుమారు 36 వేల గేదెలు, ఆవులు, ఎద్దులు వగైరా, సీఎస్‌పురం ఏడీఏ పరిధిలోని పామూరు, సీఎస్ పురం మండలాల్లో ఒక లక్ష మేకలు గొర్రెలు, ఇతర జీవాలు, సుమారు 80 వేలకు పైగా గేదెలు, ఆవులు, ఎద్దులు 27, 825 గృహాల్లో సర్వే చేయాల్సి ఉంది. హెచ్‌ఎంపాడు ఏడీఏహెచ్ పరిధిలోని హెచ్‌ఎంపాడు, వెలిగండ్ల మండలాల్లో మేకలు, గొర్రెలు సుమారు 1లక్ష 35 వేలు, గేదెలు, ఆవులు, ఎద్దులు 37,500 ఉండగా, వాటికి సంబంధించి 15,995 గృహాల్లో సర్వే జరగాల్సి ఉంది. 26 మంది ఎన్యుమరేటర్లు, ఇద్దరు సూపర్ వైజర్లు సర్వేలో పాల్గొంటున్నారు.

16 రకాల జీవాల లెక్కింపు

గ్రామాల్లో ఫిబ్రవరి వరకు జరిగే పశుగణన ప్రక్రియలో 16 రకాల జీవాలను లెక్కింపు చేస్తారు. ఆవులు, గేదెలు, మేకలు, గోర్రెలతో పాటు అన్ని రకాల జంతువులు 16 వరకు ఉంటాయి. దీనిపై ఇప్పటికే పశు వర్ధక శాఖ అధికారులు, సిబ్బంది, పశు పోషకులకు అవగాహన కల్పించారు. ఇంటింటికీ వెళ్లి పశుగణన పూర్తి చేసి, స్టిక్కర్లు, తగిలించి యాప్‌లో నమోదు చేస్తున్నారు. జీవాలకు పాగు ఉన్న వాటిని సంబంధించిన నంబర్‌లో ట్యాగ్ చేస్తారు. క్షేత్ర స్థాయిలో జరిగే ఈ ప్రక్రియను సూపర్ వైజర్లుగా ఉండే డాక్టర్లు, ఏడీఏ హెచ్‌లు వీటిని పరిశీలిస్తున్నారు.


పశు గణన సర్వే


పశుగణన సర్వే పరిశీలిస్తున్న ఏడీఏహెచ్ శ్రీనివాసరెడ్డి

పశుగణనతో ఎంతో ఉపయోగం:



పశుగణన వల్ల ఎంతో ఉపయోగం ఉంది. పథకాల అమలుకు ఇది అవసరం దోహదపడుతుంది. పశువులకు ఆహార భద్రత కల్పించడంలో.. సంక్రమణ వ్యాధులను నివారించడంలో, జీవనోపాధి కల్పించడానికి, పశుగణన ఉపయోగ పడుతుంది.

గజ్జల శ్రీనివాసరెడ్డి(ఏడీఏహెచ్)


బోర్ ను పరిశీలిస్తున్న దద్దాల నారాయణ యాదవ్

బోర్ ధ్వంసంపై దద్దాల ధ్వజం

పీసీ పల్లి: మండల పరిధిలోని మురుగమ్మి గ్రామంలో గురువారం టీడీపీ నాయకులు చేసిన చర్యలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ అద్దాల నారాయణ యాదవ్ శుక్రవారం ఖండించారు.

గురువారం రాత్రి ఓ వివాహ కార్యక్రమానికి దద్దాల వెళ్లగా.. అదే రోజు సాయంత్రం టీడీపీకి చెందిన పెద్దిరెడ్డి కృష్ణారెడ్డి కుమారుడు పెద్దిరెడ్డి వెంకట్రావు లక్ష రూపాయలు విలువ చేసే డీప్ బోరును ధ్వంసం చేశారు. ఈ బోర్ వల్ల 30 కుటుంబాలు మంచినీళ్లు తాగుతున్నాయి. కాగా మీకు నీళ్లు ఎందుకురా.. వైఎస్సార్ సీపీకి ఓట్లు వేశారు రా మీరు? అంటూ యానాదుల కాలనీకి వెళుతున్న బోర్‌ను ధ్వంసం చేశాడు. ఈ విషయం పెళ్లికి వచ్చిన దద్దాల దృష్టికి యానాది కాలనీవాసులు తీసుకెళ్లారు. ఆయన స్వయంగా వెళ్లి పరిశీలించారు. ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై శుక్రవారం మాజీ ఎంపీపీ భతుల అంజయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గోపవరపు బొర్రారెడ్డి, ఎంపీటీసీ భూమిరెడ్డి కొండారెడ్డి, మండల సేవల అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి , ఎర్రం రెడ్డి మోహన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, శ్రీను , ఏడుకొండలు రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, కోటిరెడ్డి, నల్లగంగుల శ్రీనివాస్ యాదవ్, లెక్కలు వెంకటేశ్వర్లు, కొండారెడ్డి, తదితరులున్నారు.

ఫ్లోరోసిస్‌పై అవగాహన తప్పనిసరి

కనిగిరి రూరల్: ఫ్లోరోసిస్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఫ్లోరిసిస్ అధికారి డాక్టర్ వి. అనిల్ కుమార్ అన్నారు. చిన ఇర్లపాడు, మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. కాల్షియం, విటమిన్ సీ, అధికంగా ఉంటే పాలు, పెరుగు, రాగి జావ అధికంగా వాడాలన్నారు. స్థానిక వైద్యులు దాదాషరీఫ్ అధ్యక్షతన జరిగిన అవగాహన కార్యక్రమంలో జిల్లా ఫ్లోరోసిస్ అధికారి అనీల్ కుమార్ మాట్లాడారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం 46 మందికి పంపిణీ చేసిన వీల్ చైర్స్, వాకింగ్ స్టిక్స్, లంబార్ బెల్టులు స్వీయ పరిశీలన చేశారు. హెల్త్ ఎడ్యుకేటర్ ఎంవీ విజయభాస్కర్ రావు, హెచ్‌ఎం వర ప్రసాద్, సూపర్ వైజర్ ఆంజనేయులు, ఏఎస్‌ఎం పద్మజ, ఎంఎల్‌హెచ్‌పీ సాయినాథ్, బ్రహ్మయ్య, సుధాకర్, ఆశ కార్యకర్తలు, ఎస్‌కే రఫీ, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అనీల్ కుమార్

ప్రతి రైతు శాస్త్రవేత్తగా మారాలి

కందుకూరు రూరల్: ప్రతి రైతు శాస్త్రవేత్తగా మారాలని మండల వ్యవసాయాధికారి వి.రాము అన్నారు. మండలంలోని మోపాడు గ్రామంలో మేలైన వ్యవసాయ సాగు పద్ధతుల (గ్యాప్) పొలంబడి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ రైతులు వ్యవసాయాన్ని శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల సూచనల మేరకు సాగు చేసుకోవాలన్నారు. రైతులను శాస్త్రవేత్తలుగా చేయడమే దీని ప్రధాన ఉద్దేశమన్నారు. మోపాడు గ్రామ పరిధిలో వరి రకం కేఎన్‌ఎం 1638 నారుమడి, నాట్లు వేస్తున్నారని తెలిపారు. డ్రమ్ సీడర్‌తో వేసిన వరి పొలాలను పరిశీలించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త జె.జ్యోతి మాట్లాడుతూ తెగుళ్ల బారి నుంచి పంట కాపాడాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయాధికారి డి.ధనమ్మ మాట్లాడుతూ ఆవు మూత్రం, ఆవు పేడతో బీజామృతం తయారు చేసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయ మోడల్ మేకర్ పి.మాధవ మాట్లాడుతూ ఏటీఎం మోడల్‌లో పలు రకాల తృణ/చిరు ధాన్యాలు వేసుకుంటే రైతుకు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయాన్ని పొందవచ్చన్నారు. కందుకూరు రైతు బజారులో అన్ని రకాల కషాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కేవీకే శాస్త్రవేత్త మాయాంక్, మోపాడు గ్రామ వ్యవసాయ సహాయకులు ఇ.రమణయ్య, రైతులు పాల్గొన్నారు.


కందుకూరు: వరి నాట్లు పరిశీలిస్తున్న అధికారులు

ఓటు కోసం ప్రత్యేక శిబిరాలు

కందుకూరు: ఎన్నికల సంఘం ఆదేశాల్లో భాగంగా శని, ఆది వారాల్లో ప్రత్యేక ఓటర్ నమోదు, పరిశీలన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషన్ కె. అనూష తెలిపారు. దీనిలో భాగంగా బూత్ స్థాయి సిబ్బందికి శుక్రవారం స్థానిక కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనిలో ఈనెల 9, 10వ తేదీలు, 23,24వ తేదీల్లో బూత్ స్థాయి పోలింగ్ సిబ్బంది అంతా ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ తేదీల్లో ఓటర్ ఎవరైనా తమకు సంబంధించిన ఓటు నమోదు కోసం, ఓటర్ జాబితాలో తప్పులు సరిచేసేందుకు ఫిర్యాదులు ఇవ్వవచ్చునని చెప్పారు. ప్రజలు ఈ ప్రత్యేక ఓటర్ నమోదు, పరిశీలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


బూత్ స్థాయి సిబ్బందికి అవగాహన కార్యక్రమం

విజృంభిస్తున్న వైరల్ జ్వరాలు

- డెంగీ లక్షణాలుండటంతో ప్రైవేటు వైద్యశాలలకు పరుగులు

లింగసముద్రం: మండలంలోని అన్ని గ్రామాల్లో వైరల్ జ్వరాలు, డెంగీ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఏ గ్రామానికి వెళ్లినా జ్వరపీడితులు మంచం పట్టి మూలుగుతున్నారు. ఎవరిని కదిపినా దగ్గు, జలుబు, జ్వరం, టైఫాయిడ్, వైరల్ జ్వరాలతో పాటు డెంగీ లక్షణాలుండటంతో పట్టణాల్లోని ప్రైవేట్ వైద్యాశాలలకు క్యూ కడుతున్నారు. వారం రోజుల క్రితం పెంట్రాలలో చంద్రరావు అనే వ్యక్తి డెంగీ లక్షణాలు ఉండడంతో ఒంగోలులో చేరాడు. మూడు రోజులకు ప్లేట్‌లెట్స్ తగ్గి మృతి చెందాడు. అలాగే పెంట్రాల గ్రామంలో వైరల్ జ్వరాలు ఎక్కువగా ఉండడంతో కందుకూరు, ఒంగోలులో ప్రైవేటు వైద్యశాలల్లో చేరి చికిత్స పొందుతున్నారు. ఎంపీడీఓకు, పంచాయతీ అధికారులకు, పీహెచ్‌సీ అధికారులకు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, మురుగు కాలువలు ఉండటంతో దోమలు ప్రబలతున్నాయిని తెలిపారు. బ్లీచింగ్, ఎబేట్ ద్రావణాన్ని పిచికారీ చెయాలని విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు వైద్యశాలల్లో వేలకు వేలు ఖర్చు చేయాల్సి వస్తోందని వాపోయారు.

కనిగిరిలో ప్రొటోకాల్ రగడ

- టీడీపీ నేతలకు వేదికపై ప్రాధాన్యత స్థానం
- ప్రజా ప్రతినిధులకు చివరి స్థానంలో కుర్చీ
- వ్యవసాయ అధికారుల తీరుపై మండిపడ్డ జెడ్పీటీసీ కస్తూరి రెడ్డి

కనిగిరి రూరల్: స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద సబ్సిడీపై శనగ విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ప్రొటోకాల్ రగడ చోటు చేసుకుంది. శనగ పంపిణీ కార్యక్రమ సభలో వేదికపై ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఆ తర్వాత జడ్పీటీసీ కస్తూరిరెడ్డి, ఎంపీపీ దంతులూరి ప్రకాశంలు వచ్చారు. అయితే వేదికపై ఎమ్మెల్యే, స్థానిక ఏడీఏతో పాటు, జెడ్పీటీసీ, ఎంపీపీ, చైర్మన్‌లు ప్రొటోకాల్ ప్రకారం కూర్చోవాలి. ఆతర్వాత ఇతరులు ప్రాధాన్యత ప్రకారం అవకాశం కల్పించాలి. అయితే ఎమ్మెల్యే పక్కన అటు, ఇటు టీడీపీ నేతలు కూర్చుని.. జెడ్పీటీసీకి చివరి స్థానంలో కుర్చీ ఉంచారు. ఇష్టం లేకుండా అసలు మీటింగ్ కే ఆహ్వానించ వద్దని జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి ప్రొటోకాల్ పై అధికారుల వైఖరిపై తీవ్రంగా మండిపడ్డారు. దీంతో కొద్ది సేపు సభలో చర్చ నెలకొంది. ఆతర్వాత జరిగిన సభలో ఎమ్మెల్యే ఉగ్ర మాట్లాడుతూ జెడ్పీటీసీ వాఖ్యలపై వ్యంగంగా వాఖ్యనించారు. తమను అవమాన పరచడం పట్ల జిల్లా కలెక్టర్‌కు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్లు జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి విలేకర్లకు తెలిపారు. కాగా 25 శాతం సబ్సిడీపై శనగ విత్తనాలను,వ్యవసాయ యంత్ర పరికరాలను ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఏడీఏ ఇ వెంకట రమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ ప్రకాశం, జెడ్పీటీసీ కస్తూరి రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, వ్యవసాయ అధికారులు, సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


సభలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి, వేదికపై ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

ధర్నా జయప్రదం చేయండి


మాట్లాడుతున్న ఊసా వెంకటేశ్వర్లు

సీఎస్‌పురం (పామూరు): ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 15వ తేదీన స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఊసా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం ప్రజాపోరు కరపత్రాలను ఆవిష్కరించారు. ఊసా రాజ్యలక్ష్మి, నరసింహులు, నాగమల్లేశ్వరరావు, ఇర్ల తిరుపతయ్య, బలభద్ర పెద్దయ్య, నాగేశ్వరరావు, తిరుపతమ్మ, పి.శ్రీనివాసులు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ క్షేత్ర యాత్ర

పామూరు: కార్తీకమాసం సందర్భంగా కనిగిరి ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ఈనెల 13, 23, డిసెంబర్ 14 వ తేదీల్లో క్షేత్ర యాత్ర ప్రత్యేక సర్వీస్‌లు ఏర్పాటు చేసినట్లు కనిగిరి డీఎం మహ్మద్ సయనాబేగం తెలిపారు. శుక్రవారం పామూరు ఆర్టీసీ బస్టాండ్‌ను తనిఖీ చేసిన అనంతరం మాట్లాడారు. వివరాలకు 9959225701 నంబరును సంప్రదించాలన్నారు. బస్టాండ్‌లో కంపకర్ర చెట్ల తొలగింపు చేపట్టి తక్షణం పూర్తిచేయాలని సిబ్బందికి సూచించారు. బస్టాండ్‌లో ఫ్యాన్‌ల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు.

ముబీనాకు నివాళి


నివాళులర్పిస్తున్న దద్దాల నారాయణ యాదవ్, అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: స్థానిక దొరువు బజార్‌లో ఎస్‌కే ఖాదర్‌బాషా (పుల్లయ్య) కుమార్తె ముబీనా అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె భౌతిక కాయాన్ని శుక్రవారం వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్, మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్‌లు సందర్శించి నివాళులర్పించారు. కోఆప్షన్ సభ్యుడు చింతం శ్రీనివాసుల యాదవ్, ఎస్‌కే ఖాశింసా, స్వర్ణ ఏడుకొండలు రెడ్డి, స్థానిక నాయకులున్నారు.

నిర్మాణాలు పూర్తిచేస్తే బిల్లులు


అంకేపల్లిలోని లేఅవుట్‌లో గృహాలను పరిశీలిస్తున్న డీఈ శ్రీనివాస ప్రసాదు

మద్దిపాడు: త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తే పూర్తి స్థాయిలో బిల్లులు చెల్లిస్తామని హౌసింగ్ పీడీ పెరుగు శ్రీనివాస ప్రసాదు అన్నారు. శుక్రవారం అంకేపల్లి, మద్దిపాడు గ్రామాల్లో ఉన్న జగనన్న లే అవుట్‌లను పరిశీలించారు. 667 గృహాలు మంజూరు కాగా.. 399 ఇంటి నిర్మాణాలు పూర్తి అయినట్లు తెలిపారు. 268 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. డీఈఈ సత్యన్నారాయణ, ఏఈ వెంకటేశ్వర్లు, ఏపీఓ రాంబాబు, ఏపీఎం కోటేశ్వరరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లున్నారు.

త్వరగా గోకులం షెడ్లు నిర్మించాలి


టంగుటూరులో షెడ్లు పరిశీలిస్తున్న అధికారులు

టంగుటూరు: మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన గోకులం షెడ్లు త్వరగా నిర్మించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ జోసఫ్ కుమార్ కోరారు. శుక్రవారం గోకులం షెడ్లు పరిశీలించారు. 76 మంజూరు కాగా కేవలం తొమ్మిది మాత్రమే నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. ఎంపీడీఓ దేవసేన కుమారి, ఏపీడీ వెంకటస్వామి, ఏపీఓ సుభాషిణి, సిబ్బంది పాల్గొన్నారు.

క్యాన్సర్ రహిత గ్రామాలే లక్ష్యం


పొన్నలూరు సెంటర్‌లో మానవహారం చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

పొన్నలూరు: క్యాన్సర్ రహిత గ్రామాల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పీహెచ్‌సీ డాక్టర్ రవికిరణ్ అన్నారు. క్యాన్సర్ వ్యాధి నివారణకై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ చేసిన అనంతరం మానవహారం చేపట్టారు. చుట్ట, బీడీ, సిగరెట్లు, పాన్‌పరాగ్, గుట్కా వంటి క్యాన్సర్ సోకే వాటిని వాడవద్దన్నారు. డాక్టర్లు చైతన్య, ఉమేరా, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు కామేపల్లి విద్యార్థి ఎంపిక


కొండపి: రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

జరుగుమల్లి (సింగరాయకొండ): రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు జరుగుమల్లి మండలం కామేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి పల్లపు అభిలాష్ ఎంపికయినట్లు హెచ్‌ఎం ఎల్. అనూరాధ శుక్రవారం తెలిపారు. గురువారం ఒంగోలు లోని డీఆర్‌ఆర్ మున్సిపల్ హైస్కూల్ లో జరిగిన అండర్-14 బాలబాలికల ప్రకాశం జిల్లా స్థాయి కబడ్డీ జట్ల ఎంపికలో ఉత్తమ ప్రతిభ కనబరచినట్లు పీఈటీ కోటేశ్వరరావు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక

కొండపి: రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ఐ కబడ్డీ పోటీలకు ఇద్దరు విద్యార్థినులు ఎంపికైనట్లు కె. ఉప్పలపాడు జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం వి.సూసున్న కుమార్ తెలిపారు. గురువారం ఒంగోలులో నిర్వహించిన అండర్ 14 విభాగంలో కె. రేష్మ శ్రీ, సీహెచ్ పుష్ప బిందు ఎంపికయ్యారన్నారు. ప్రధానోపాధ్యాయుడు, పీడీ, ఉపాధ్యాయులు అభినందించారు.

తెగుళ్లను తట్టుకునే రకాలు సాగు చేయండి

పామూరు: తెగుళ్లను తట్టుకుని అధిక దిగుబడులు ఇచ్చే రకాల సాగుకు రైతులు ప్రాధాన్యం ఇవ్వాలని కనిగిరి ఏడీఏ ఇ.వెంకటరమణ, కార్యక్రమ కోఆర్డినేటర్ డాక్టర్ జి.రమేష్ అన్నారు. చింతలపాలెం, దూబగుంట్ల గ్రామాల్లో శుక్రవారం రైతులకు సామూహిక ప్రదర్శన క్షేత్రాలు పథకం కింద టీబీజీ-104 అను మినుము రకం విత్తనాలను కృషి విజ్ఞాన కేంద్రం వారు అందజేశారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త టి.వెంకటేశ్వరరెడ్డి, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిని ఢీకొని వ్యక్తి మృతి

పామూరు: నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిని ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన శుక్రవారం రాత్రి పామూరు మండలంలోని పాబోలువారిపల్లె సమీపంలో చోటుచేసుకుంది. మండలంలోని అయ్యవారిపల్లె గ్రామానికి చెందిన కూడల కేశవులు చనిపోగా, ఆయన బంధువు అయిన నెల్లూరు జిల్లా వింజమూరుకు చెందిన ఓబులేసు (45) అయ్యవారిపల్లె గ్రామానికి వచ్చి కేశవులు దహన సంస్కారాల కార్యక్రమం ముగిసిన తర్వాత తిరిగి బైక్‌పై వింజమూరు ప్రయాణమయ్యాడు. ఆ సమయంలో మండలంలోని పాబోలువారిపల్లె గ్రామ సమీపంలో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి వద్ద డైవర్షన్ రోడ్డుకు వెళ్లకుండా బైక్‌తో నేరుగా బ్రిడ్జిని బలంగా ఢీకొట్టాడు. దీంతో అతని తలకు గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై వివరాలు సేకరిస్తున్నారు.

సీపీఎం ప్రజా పోరుయాత్ర ప్రారంభం

గుడ్లూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ, ప్రజా సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ సీపీఎం రాష్ట్ర కమిటీ ఈ నెల 8 నుంచి 14వ తేఈ వరకు సీపీఎం ప్రజా పోరు చేపట్టింది. దీనిలో భాగంగా శుక్రవారం గుడ్లూరులో ఇంటింటి ప్రచారం ప్రారంభించారు. ఎమ్ఎస్ఆర్ గిరిజన కాలనీలో కరపత్రాలు పంపిణీ చేశారు. కాలనీ వాసులు మాట్లాడుతూ పిల్లలు చదువుకోవడానికి ప్రాథమిక పాఠశాల కావాలన్నారు. ఇంటి పట్టాలు మంజూరు చేయాలని, గత నెల రోజుల నుంచి మంచినీరు రావడం లేదని తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ గుడ్లూరు ఏరియా కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మనకు ఎన్నికల్లో అనేక వాగ్దానాలు చేశారన్నారు. ఉచితంగా పేదలకు కరెంట్ ఇచ్చి తక్కు ధరకే అందజేస్తామని చెప్పారు.

క్లుప్తంగా

బాధితురాలికి వైఎస్సార్ సీపీ అండ


ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: టంగుటూరు మండలం కారుమంచి గ్రామానికి చెందిన లైంగికదాడికి గురైన విద్యార్థినికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని మాజీ మంత్రి, పార్టీ పీఏసీ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. విద్యార్థినిపై లైంగికదాడి జరిగి 24 గంటలు దాటినా ఇంతవరకు పోలీసులు కేసు నమోదు చేయలేదని ఆరోపించారు. బాలికతో పాటు ఆమె తల్లికీ ప్రాణగండం ఉండటంతో ఇద్దరికీ మహిళా పోలీసు అధికారుల సంరక్షణలో రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. డీఈఓ తన స్వీయ పర్యవేక్షణలో లైంగికదాడి ఘటనపై సమగ్ర విచారణ జరపాలని, ఎస్పీ దామోదర్ ప్రత్యేక శ్రద్ధ చూపి దాడికి గల కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దాడికి గురైన విద్యార్థిని వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు సమీప బంధువు కావడంతో ఆయనతో కలిసి శనివారం ఉదయం ఒంగోలు జీజీహెచ్‌కు వెళ్తున్నట్లు వివరించారు. బాలికను పరామర్శించి ధైర్యం చెబుతామని ఆమె కుటుంబ సభ్యులకు భరోసా కల్పిస్తామని చెప్పారు.

గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన

హనుమంతునిపాడు: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల్లో శుక్రవారం ఎస్సై మాధవరావు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ప్రయాణాలు చేసే సమయంలో, ఇతరులతో మాట్లాడేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం పాఠశాల్లో ఏర్పాటు చేసిన సీసీ పుటేజీలను పరిశీలించారు. హెచ్‌ఎం బొప్పరాజు సుబ్బారావు, ఉపాధ్యాయులున్నారు.

తాగు నీరు అందించాలి

పీసీ పల్లి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ హెచ్. జెఫన్యా అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. పీసీ పల్లి మండలాన్ని వెలిగొండ ప్రాజెక్టు పరిధిలోకి చేర్చాలని, మండలానికి సాగు తాగునీరు అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి పలువురు అర్జీలు అందజేశారు. ఎమ్మెల్యే డాక్టర్ నరసింహ రెడ్డి మాట్లాడుతూ అంతా కలిసి పార్టీలకు అతీతంగా మండల అభివృద్ధికి సహకరించాలన్నారు. అనంతరం అర్జీలను స్వీకరించారు. అదేవిధంగా పీహెచ్‌సీలో అన్ని సౌకర్యాలతో ఉన్న వైద్యం అందుతుందని విద్య, వైద్యానికి మొదటి ప్రాధాన్య ఇస్తామని ఆయన అన్నారు. అనంతరం రూ. 80 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పరిశీలించారు. ఎంపీటీసీ అభ్యర్థి భూమి రెడ్డి కొండారెడ్డి, ఎంపీడీవో ప్రభాకర్ శర్మ, సీఐ ఖాజావలి, జెడ్పీటీసీ, పెద్దిరెడ్డి లక్ష్మీకాంతం ఓకే రెడ్డి సర్పంచులు పరిమి వెంకటరావు, తిరుపతయ్య, మరియమ్మ, ఎంపీటీసీలు మూల సీత అధికారులు పాల్గొన్నారు.

మినుము సాగుపై దృష్టి సారించాలి


మినుము విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు, ఏడీఏ, ఏఓ

సీఎస్‌పురం(పామూరు): అధిక దిగుబడినిచ్చే టీబీజీ-104 రకం మినుము సాగుపై రైతులు దృష్టి సారించాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ జి.రమేష్, కనిగిరి ఏడీఏ ఇ.వెంకట రమణ అన్నారు. కొండబోయినపల్లిలో శుక్రవారం రైతులకు సామూహిక ప్రదర్శన క్షేత్రాలు పథకం కింద 90 ఎకరాల్లో టీబీటీ-104 అనే రకం మినుము విత్తనాలను కృషి విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో అందించారు. శాస్త్రవేత్త టి.వెంకటేశ్వర్‌రెడ్డి, ఏఓ బి.సంపత్‌కుమార్, ఏఈఓ పి.నగేష్, పావలి శ్రీనివాసులు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

వ్యాక్సిన్ వేయించుకోవాలి

సింగరాయకొండ: గర్భిణులు నిబంధనల ప్రకారం పరీక్షలు చేయించుకోవటంతో పాటు వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించుకోవాలని సీనియర్ డాక్టర్ ధీరేందర్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ చైతన్యకృష్ణ, రాజమ్మ పాల్గొన్నారు.

ప్రజాపోరు వాల్ పోస్టర్ ఆవిష్కరణ

కొండపి: మండలంలోని శుక్రవారం పెరిదేపి గ్రామంలో ప్రజా పోరు వాల్ పోస్టును ఆవిష్కరించి 14వ తేది శుక్రవారం కొండపి మండలం వద్ద జరిగే ధర్నాకు పాల్గొనాలని సీపీఎం మండల కార్యదర్శి మల్లెల కొండయ్య పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా నాయకులు కేజీ మస్తాన్, పెద్ద పేతురు, కోటేశ్వరరావు, మాధవి, వరమ్మ పాల్గొన్నారు.

11న కనిగిరిలో జాబ్ మేళా

కనిగిరి రూరల్: ఈనెల 11న సోమవారం జాబ్ మేళా కార్యక్రమం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ ఆర్. బెనర్జీ బాబు తెలిపారు. ఎల్ అండ్ టీ ఫైనాన్స్, సింధుజ, అరబిందో, ఫార్మ సంస్థలు పాల్గొంటాయని తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 8008822821ను సంప్రదించాలని తెలిపారు.